రేవంత్‌రెడ్డి బేరం.. ఢిల్లీలో సమరం

- కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ వార్‌రూం భేటీలో 'అమెరికా' చిచ్చు
- నేతల మధ్య మాటల యుద్ధం
- 36 మంది నుంచి డబ్బు వసూలు చేశారని రేవంత్‌పై ఆరోపణ
- అందుకే నివేదిక మార్చారని ఆగ్రహం
- పీసీసీ చీఫ్‌పై కమిటీ చైర్మన్ మురళీధరన్ ఆగ్రహం
- ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయం ముందు విద్యార్థి నేతల ధర్నా

రేవంత్ వర్సెస్ కోమటిరెడ్డి

అభ్యర్థుల పేర్ల మార్పుపై రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగినట్టు తెలిసింది. ఢిల్లీలో రెండుసార్లు జరిగిన స్క్రీనింగ్ కమిటీ భేటీలో 25 పేర్లు ఖరారు కాగా ఇందులోనూ రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని పలువురు పేర్లను తొలగించినట్టు తెలిసింది. అసలు వ్యక్తులు కాకుండా తన వారి పేర్లు జాబితాలో చేర్చారంటూ కోమటిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఒకసారి ఖరారు చేసిన పేర్లలో మార్పులు చేయడం ఏంటని ప్రశ్నించారు. దీనికి తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి.. టీపీసీసీ అధ్యక్షుడిగా ఎవరి పేర్లు చేర్చితే బాగుంటుందో తనకు తెలుసని, ఎవరూ తనకు చెప్పాల్సిన అవసరం లేదని చెప్పడంతో మిగతా నాయకులు కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడైతే మాత్రం సొంతంగా జాబితా తయారు ఎలా చేస్తారంటూ నిలదీసినట్టు సమాచారం.

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ వార్‌రూం భేటీలో 'అమెరికా' చిచ్చు రేగింది. అమెరికా వేదికగా టికెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలపై ఆదివారం ఢిల్లీలో జరిగిన భేటీలో రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం జరిగినట్టు తెలిసింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ సమక్షంలోనే రాష్ట్ర కాంగ్రెస్ కీలక నేత ఒకరు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసినట్టు సమాచారం. గతంలో అమెరికా పర్యటనకు వెళ్లిన రేవంత్‌రెడ్డి అక్కడ సుమారు 36 టికెట్లకు సంబంధించి బేరసారాలు చేశారని ఆరోపించినట్టు తెలుస్తున్నది. వారికి టికెట్లు ఇప్పిస్తానని భరోసా ఇచ్చి భారీ మొత్తంలో డబ్బులు దండుకున్నారని ఆరోపించినట్టు సమాచారం. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ నిర్వహించిన సర్వేలో డబ్బులు ఇచ్చిన వారిలోని కొందరు నేతలకు చోటు దక్కలేదట. రంగంలోకి దిగిన రేవంత్‌రెడ్డి ఆ నేతల పేర్లు సర్వేలో ఉండేలా తెరవెనుక మాయ చేసినట్టు భేటీలో ఆరోపించడంతో రేవంత్‌రెడ్డి వర్సెస్ రాష్ట్ర కాంగ్రెస్ నేతలుగా భేటీ మారిపోయిందని సమాచారం. చైర్మన్ సమక్షంలోనే ఒకరిపై మరొకరు తీవ్రస్థాయిలో కేకలు వేసుకున్నట్టు తెలిసింది. ఆగ్రహించిన కమిటీ చైర్మన్ మురళీధరన్.. రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారట. అనంతరం కమిటీ సభ్యులతో విడివిడిగా భేటీ అయినట్టు సమాచారం. ఈ సమావేశంలో రేవంత్‌రెడ్డి టికెట్ల అమ్మకంపైనే ప్రధానంగా నేతలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

మనోహర్‌రెడ్డి బహిరంగంగానే

ఢిల్లీ వార్ రూం సమావేశంలో రేవంత్‌రెడ్డిపై నేతలు చేసిన ఆరోపణలకు బలం చేకూరే ఘటనలు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ బహిష్కృతనేత కొత్త మనోహర్‌రెడ్డి బహిరంగంగానే రేవంత్‌పై ఇలాంటి ఆరోపణలు చేశారు. పటాన్‌చెరు టికెట్ కోసం గాలి అనిల్‌కుమార్ నుంచి రూ. 12 కోట్లు, మహేశ్వరం టికెట్ కోసం పారిజాత నుంచి రూ. 10 కోట్లు, 5 ఎకరాల భూమి, కల్వకుర్తి టికెట్ కోసం కసిరెడ్డి నారాయణరెడ్డి నుంచి రూ. 6 కోట్లు వసూలు చేసినట్టు ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఆ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు సర్వేపైనా ఇక్కడి నేతలు అభ్యంతరం, అనుమానాలు వ్యక్తం చేశారు. అర్హత లేని వాళ్లకు, గెలిచే స్థాయి లేని వాళ్లకు సర్వేలో మంచిగా రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. స్పందించిన అధిష్ఠానం విమర్శలు వచ్చిన సుమారు 35 స్థానాల్లో రీ సర్వే చేయించింది.

కాంగ్రెస్‌లో కులాల కుంపట్లు

ఇప్పటికే విభేదాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు కులాల కుమ్ములాటలు కూడా మొదలయ్యాయి. ఇప్పటి వరకు వ్యక్తులుగా విడివిడిగా ఉన్న నేతలు ఇప్పుడు కులాల వారీగా విడిపోయినట్టు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కులాల వారీగా టికెట్లు డిమాండ్ చేయడం అనుమానాలకు మరింత తావిస్తున్నది. తమకు కనీసం 34 సీట్లు ఇవ్వాలంటూ బీసీలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుండగా వారికి అధిష్ఠానం మొండి చేయి చూపించడం ఖాయమన్న ప్రచారం కూడా జరుగుతున్నది. మరోవైపు ఖమ్మ సామాజిక వర్గం నేతలు కూడా తమకు కనీసం 11 సీట్లు కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మహిళా కాంగ్రెస్ తమకు 25 సీట్లు కావాలని, యూత్ కాంగ్రెస్ ఐదు సీట్లు కావాలంటూ డిమాండ్ చేస్తున్నది.

ఢిల్లీలో ఓయూ నేతల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 8: టికెట్లు డిమాండ్ చేస్తూ ఓయూ విద్యార్థి సంఘం నేతలు ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ జరుగుతున్న వార్ రూం ఎదుట ఆదివారం దిగారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని నినాదాలు చేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో పనిచేసిన తమకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తానని 2018 ఎన్నికల సమయంలో రాహుల్ హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. పదేండ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తూ, కేసులను ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేస్తున్న తమకు టికెట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కురువ విజయ్‌కుమార్ (గద్వాల), మానవతారాయ్ (సత్తుపల్లి), పున్న కైలాశ్ నేత (మునుగోడు), దుర్గం భాస్కర్ (చెన్నూరు), డాక్టర్ కేతూరి వెంకటేశ్ (కొల్లాపూర్), బాలలక్ష్మి (జనగామ) తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ సమావేశంలో నినదిస్తున్న రాంబాబు యాదవ్, ఇతర నాయకులు

కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేద్దాం

- ఆటోడ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి
- బీఆర్ఎస్‌కి డ్రైవర్ల కుటుంబాలు మద్దతుగా నిలవాలి
- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ పిలుపు

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ఎనలేని కృషి చేసిన సీఎం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌టీయూ అనుబంధ తెలంగాణ ఆటో, మోటర్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల కుటుంబాలన్నీ బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఆటోడ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. రోడ్డు పన్ను రద్దు, రూ.5 లక్షల ప్రమాద బీమా వంటి పథకాలను అమలు చేశారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఆటో డ్రైవర్ల గురించి ఆలోచించలేదని, సీఎం కేసీఆర్ మానవతా దృక్పథంతో ఆలోచించారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆటో డ్రైవర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్ సింగ్, నాయకులు పాండునాయక్, శాతం రమేశ్, నిరంజన్, వాజిద్‌భాయ్, శ్రీనివాస్, బాలనర్సింహ, ప్రదీప్‌కుమార్, సీహెచ్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కు మద్దతుగా బాండ్ పేపర్

భీమ్‌గల్/మోర్తాడ్, వేల్పూర్, అక్టోబర్ 8 : వచ్చే ఎన్నికల్లో బాల్కొండ ఎమ్మెల్యేగా రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని మరోసారి గెలిపించుకుంటామని గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా భీమ్‌గల్ మండల కేంద్రంలోని మేరు సంఘానికి చెందిన 127 కుటుంబాల వారు బాండ్ పేపర్‌పై రాసిన తీర్మాన ప్రతిని ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులకు అందజేశారు. మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామానికి చెందిన గురుడుకాపు వృద్ధ సంఘం సభ్యులు, వేల్పూర్ మండలం దేవాంగ సంఘానికి చెందిన 54 కుటుంబాలు తీర్మాన ప్రతులను ప్రజాప్రతినిధులకు అందజేశారు.

ఆదివారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో మంత్రి వేములకు మద్దతు తెలుపుతూ చేసిన తీర్మాన పత్రాన్ని ప్రజాప్రతినిధికి అందజేస్తున్న మేరుసంఘం సభ్యులు

శ్రీనివాస్‌గౌడ్‌కు సీపీసీ ఉద్యోగుల మద్దతు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 8 : మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం మద్దతు ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షించింది. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి యూనియన్ ప్రతినిధులు మద్దతు పత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రికి అండగా ఉంటామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోబెల్స్ ప్రచారమే బీజేపీ వ్యూహం

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సరితూగలేక కమలం అగచాట్లు
- తెలంగాణకు ఏం చేశామో చెప్పలేక నాయకగణం తిప్పలు
- చిన్నా చితకా పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాట

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కేవలం రెండే అంశాలతో ప్రచారం చేయాలని బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడితే ప్రయోజనం లేదని ఆ పార్టీ భావిస్తున్నట్టు సమాచారం. 2014తో పోల్చితే పదేండ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధికి వేరే ఏ రాష్ట్రమూ సాటిరాదన్నదని వారికి అవగతమైంది. బీజేపీ పాలిత రాష్ట్రాలేవీ కేంద్రం ఇచ్చే ఏ ర్యాకింగ్స్‌లోనూ, అవార్డుల్లోనూ తెలంగాణ దరిదాపుల్లో లేవు. ఈ నేపథ్యంలో కుటుంబపాలన, అవినీతి గురించి మాత్రమే మాట్లాడాలని నేతలకు ఆదేశాలు వెళ్లాయి. ఇప్పటికే రాష్ట్ర నాయకత్వంతోపాటు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర కేంద్ర మంత్రులు, ఇలా రాష్ట్రానికి వచ్చినవారంతా అవినీతి, కుటుంబపాలన తప్ప మరొకటి మాట్లాడటం లేదు. తెలంగాణకు కేంద్రం నుంచి ఏం చేశామో, రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఏం చేస్తామో మాటవరుసకైనా చెప్పడం లేదు. వాస్తవానికి బీజేపీ ఎంచుకున్న రెండు అంశాలను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. అవినీతిపై బీజేపీ చేసేదంతా డొల్ల ప్రచారమని ప్రజలు అర్థం చేసుకున్నారు. నిజంగా అవినీతి జరిగితే కేంద్రం ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్న. అయినా మూడో ముచ్చటే వద్దని పదే పదే ఈ రెండు అంశాలనే ప్రస్తావించి, గోబెల్స్‌ను మించి ప్రచారం చేయాలని బీజేపీ నిర్ణయించుకున్నది.

పొత్తుల కోసం పాకులాట

రాష్ట్రంలో 119 నియోజవకర్గాల్లో బీజేపీకి అభ్యర్థులు దొరుకడం లేదు. గట్టిగా 30-40 నియోజకవర్గాల్లో మాత్రమే కాస్త పేరున్న నేతలు ఉన్నారని, మిగతా చోట్ల జల్లెడపట్టి వెదికినా నాలుగు ఓట్లు సంపాదించేవాళ్లు కనిపించడం లేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దరఖాస్తుల పేరుతో హడావుడి చేసినా ప్రయోజనం కలుగలేదని చెప్పుకుంటున్నారు. 'రాష్ట్ర నేతలు కోరారు కాబట్టి.. హడావుడి కోసం దరఖాస్తు చేశాం. పోటీ అంటే మా వల్ల కాదు' అని దరఖాస్తుదారులు చెప్తున్నట్టు సమాచారం. దీంతో 70-80 స్థానాల్లో పొత్తులు పెట్టుకోవాలని బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను మినహాయించి మిగతా పార్టీలపై దృష్టిపెట్టారు. వామపక్షాలు, వైఎస్సార్‌టీపీ వంటివి కాంగ్రెస్ వైపు చూస్తున్నాయి. మంగళవారం అమిత్‌షా పర్యటన అనంతరం మందకృష్ణ మాదిగ నుంచి తమకు అనుకూలంగా ప్రకటన వస్తుందన్న ఆశతో బీజేపీ నేతలు ఉన్నారు. ఆయనతో పొత్తు పెట్టుకొని 30-40 సీట్లు ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది.

మలిసంధ్యలో మనోధైర్యంగా..

మలిసంధ్యలో ఒంటరితనం ఒక్కటే తోడుగా ఉంటుంది. జీవితం ఏకాంతంగా మారుతుంది. వృద్ధాప్యంలో తోడు, నీడ కరువైన వారికి సిద్దిపేట పట్టణ నిరాశ్రయుల ఆశ్రమం మనోధైర్యం కల్పిస్తున్నది. పట్టణంలోని మణికంఠనగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆశ్రమం ఆత్మీయ భరోసా ఇస్తున్నది. వారి బాధలు, మానసిక ఒత్తిడిని మరిపించే ఆనంద నిలయంగా మారింది. ఆదివారం ఆశ్రమంలో వృద్ధులు ఆనందంగా ఆటలాడుతుండగా, ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' కెమెరాలో బంధించింది.

పేదోళ్ల చెంతకు ఐవీఎఫ్ సేవలు

- గాంధీలో సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం
- త్వరలో పేట్లబుర్జు, ఎంజీఎం దవాఖానల్లో ఏర్పాటు
- సంతానం లేని పేదలకు ఉచితంగా ఖరీదైన వైద్యం
- మంత్రి మహమూద్ అలీ వెల్లడి

గాంధీలో సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, దవాఖాన సూపరింటెండెంట్ రాజారావు తదితరులు

బన్సీలాల్‌పేట, అక్టోబర్ 8: ఇంతకాలం ప్రైవేట్ రంగానికే పరిమితమైన ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రాలు ఇప్పుడు ప్రభుత్వ దవాఖానల్లోనూ అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్ గాంధీ దవాఖానలో రూ.5 కోట్లతో ఏర్పాటుచేసిన ఐవీఎఫ్ కేంద్రాన్ని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ఆదివారం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో ఏర్పాటైన తొలి ఐవీఎఫ్ కేంద్రం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. నిరుపేద దంపతులకు సంతానం లేదనే బాధ నుంచి విముక్తి కలిగించడానికి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మూడు దవాఖానల్లో ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. గాంధీతోపాటు పేట్లబుర్జు, వరంగల్ ఎంజీఎం దవాఖానల్లో వీటిని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.15 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. దీంతో ప్రైవేట్‌లో లక్షల్లో ఖర్చయ్యే వైద్యం పేదలకు ఉచితంగానే అందుబాటులోకి వస్తున్నదని తెలిపారు. టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మాతా, శిశు సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు 70 శాతానికి పెరిగాయని వివరించారు. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు మాట్లాడుతూ.. 2018 నుంచే గాంధీ దవాఖానలో ఐయూఐ విధానం ద్వారా సంతాన సాఫల్య కేంద్రం నిర్వహిస్తున్నామని, మందులు వాడటం వలన ఇప్పటి వరకు రెండు వందల మహిళలకు సంతానం కలిగిందని చెప్పారు. నూతన ఐవీఎఫ్ కేంద్రంలో కృత్రిమ సంతానోత్పత్తి సేవలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి, బన్సీలాల్‌పేట కార్పొరేటర్ కే హేమలత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ వాణి, ఉస్మానియా, పేట్లబుర్జు, సుల్తాన్‌బజార్ దవాఖానల సూపరింటెండెంట్‌లు డాక్టర్ నాగేందర్, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ మాలతి, గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ షర్మిల, ఐవీఎఫ్ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ జానకి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

బస్సులో తరలిస్తున్న 25.33 లక్షలు స్వాధీనం

- ఆదిలాబాద్ ఎస్పీ వెల్లడి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 8: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సులో డబ్బులు తరలిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు పోలీసులు సోదాలు చేశారు. మావల వద్ద బస్సును ఆపి తనిఖీ చేయగా, ఆదిలాబాద్‌లోని ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన సజ్జనపు లక్ష్మీనారాయణ వద్ద రూ.20.80 లక్షలు, కుంబారం ప్రజాపత్ వద్ద రూ.4,53,300 నగదు లభించింది. వారు సరైన పత్రాలు చూపకపోవడంతో డబ్బు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీనారాయణ వద్ద లభించిన డబ్బును ఆదాయపన్ను శాఖకు, ప్రజాపత్ వద్ద దొరికిన మొత్తాన్ని ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ టీమ్‌కు అప్పగించినట్టు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కోరుట్లలో రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు దగ్ధం

- రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం

కోరుట్ల, అక్టోబర్ 8: జగిత్యాల జిల్లా కోరుట్లలోని టీఎస్ఆర్టీసీ డిపోలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకొని రాజధాని ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.అరకోటి మేరకు నష్టం వాటిల్లింది. కోరుట్ల డిపోకు చెందిన టీఎస్ 21జడ్ 0074 రాజధాని ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సు ఆదివారం 25 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి కోరుట్ల కొత్త బస్టాండ్‌కు వచ్చింది. ప్రయాణికులను దించిన డ్రైవర్ డిపోలోని డీజిల్ బంక్ వద్దకు బస్సును తీసుకెళ్లారు. ఆ సమయంలో బస్సు బ్యాటరీల్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఆర్టీసీ సిబ్బంది మరో బస్సు సాయంతో బస్సును బంక్ నుంచి తప్పించేందుకు విఫలయత్నం చేశారు. మంటలు డీజిల్ బంక్‌కూ వ్యాపించడంతో పైభాగం పూర్తిగా కాలిపోయింది. మెట్‌పల్లి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. మంటల్లో రాజధాని ఏసీ బస్సు పూర్తిగా దగ్ధమవడంతో సుమారు రూ.50 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని డిపో మేనేజర్ విజయమాధురి తెలిపారు.

జగిత్యాల జిల్లా కోరుట్ల ఆర్టీసీ డిపోలో దగ్ధమవుతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్

ఆరు కిలోల బంగారం పట్టివేత

కొండాపూర్, అక్టోబర్ 8: ముగ్గురు వ్యక్తుల నుంచి 6 కిలోల బంగారాన్ని చందానగర్ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ముంబై నుంచి లింగంపల్లి తారానగర్ మార్కెట్‌కు రూ.3.50 కోట్ల విలువచేసే 6 కిలోల బంగారు ఆభరణాలను తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు రంగంలోకి దిగారు. ఆభరణాలు తరలిస్తున్న రితేశ్, నవీన్, ఆనంద్‌ను అదుపులోకి తీసుకొని, బంగారాన్ని సీజ్ చేశారు.

ఫైబర్ నెట్‌కేసులో యనమల పేరు

ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ కేసులో గత ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన యనమల రామకృష్ణుడు పేరు బయటకు వస్తుందని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి తెలిపారు. లోకేశ్ పాత్ర ఉందా? లేదా? అనేది సీఐడీ దర్యాప్తులో తేలుతుందన్నారు. యనమల పాత్ర గురించి అప్పట్లోనే చెప్పానని, ఫైబర్ గ్రిడ్ కుంభకోణంలో చంద్రబాబు, అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పాత్ర ఉందని ఆరోపించారు.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన నివాసంలో అనాథ చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్ దంపతులు

అనాథ పిల్లలకు అండగా ఎమ్మెల్యే సుంకె

గంగాధర, అక్టోబర్ 8: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను అక్కున చేర్చుకుని అండగా ఉంటున్నారు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, దీవెన దంపతులు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాలతో పాటు మానకొండూర్ నియోజకవర్గంలోని శంకరపట్నం మండలానికి చెందిన పలువురు అనాథ పిల్లలను ఆదివారం ఆనవాయితీ ప్రకారం ఈ సారి కూడా దసరాను పురస్కరించుకొని గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన ఇంటికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే దంపతులు వారిని ఆప్యాయంగా పలుకరించారు. బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. దసరాను పురస్కరించుకొని వారికి కొత్త దుస్తులు అందజేశారు.

కాపురానికి రావట్లేదని బెదిరింపు కరపత్రాలు

టేకులపల్లి, అక్టోబర్ 8: భార్య కాపురానికి రాకపోవడానికి ఆమె బంధువులే కారణమని భావించిన భర్త వారి ఇంటెదుట మావోయిస్టుల పేరుతో నకిలీ కరపత్రాలు వదిలాడు. ఈ ఘటన భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో ఆదివారం వెలుగు చూసింది. తేజావత్ జంపన్న, ఆయన భార్యది టేకులపల్లి గ్రామం. వారిద్దరి మధ్య గొడవల కారణంగా ఇటీవలే జంపన్న భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడం లేదు. దీనికి భార్య తరపు బంధువులైన మంగ్యా, తిరుపతి, గణేశ్ కారకులని భావించాడు. దీంతో శనివారం అర్ధరాత్రి వారి ఇంటి ఎదుట మావోయిస్టు నకిలీ కరపత్రాలను వదిలాడు. 'జంపన్న భార్యను కాపురానికి పంపండి.. లేకపోతే చంపేస్తాం..' అని దానిలో రాసి ఉంది. జంపన్నే ఈ పని చేసి ఉంటాడని భావించి వారు టేకులపల్లి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపారు.